సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 7 । మార్చి । 2025



... 'శాశ్వత' పరిష్కారం

దివ్యాంగులకు ఎక్కడైనా ప్రభుత్వ పథకాలు వినియోగించుకునేలా శాశ్వతంగా యూడీఐడీ కార్డులు జారీ చేస్తున్నారు. 8లో





వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



పెండిపోలు పరీక్ష కేంద్రం వద్ద డీఐఈఓ రవిబాబు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం మొదలయ్యాయి. ఈ పరీక్షకు 17,262 మందికి గాను 16,855 మంది విద్యార్థులు హాజరుకాగా, 407 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 42 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ బృందాలు తనిఖీ చేశాయని డీఐఈఓ రవిబాబు వెల్లడించారు.

చేనేత, టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)కి మూడేళ్ల కాలపరిమితితో చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సు మంజూరైందని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి తెలిపారు. ఈ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 1నాటికి జనరల్ కేటగిరీ అభ్యర్థులైతే 23 ఏళ్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీలైతే 25ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కార్యాలయంలో ఏప్రిల్ మొదటి వారంలోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 90300 79242 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యథావిధిగానే రైళ్ల రాకపోకలు

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణం జరుగుతుండగా శుక్రవారం నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నామని, ఇంకొన్ని దారి మళ్లిస్తామని అధికారులు ఇటీవల ప్రకటించారు. కానీ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ, శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగానే నడుస్తాయని గురువారం మరో ప్రకటన విడుదల చేశారు. అయితే, ఇందుకు కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈమేరకు ప్రయాణికులు గమనించాలని ఖమ్మం కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ కోరారు.

శ్రీరామనవమి లోగా రహదారి మరమ్మతులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడ క్రాస్ నుండి కరుణగిరి వరకు రోడ్డు, డివైడర్లు దెబ్బతిన్నందున శ్రీరామనవమి లోగా మరమ్మతులు పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలానికి పెద్దసంఖ్యలో భక్తులు రానున్నందున ఆలోగా మరమ్మతులు చేపట్టడమే కాక నిర్మాణం పూర్తయిన డివైడర్లు, సర్కిళ్లలో మొక్కలు నాటి పెయింటింగ్ వేయించాలని సూచించారు. ఇప్పటికే కూడళ్ల ఆధునికీకరణపై హైదరాబాద్‌కు చెందిన ఐఎఫ్‌ఎస్ అధికారి కృష్ణ పరిశీలించినందున ఇతర పనులు పూర్తయ్యేలా ఖమ్మం కలెక్టర్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకోవాలని మంత్రి తెలిపారు.

మూడు బీసీ హాస్టళ్ల భవనాలకు నిధులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో శిథిలావస్థ కు చేరిన బీసీ సంక్షేమ వసతిగృహాల భవనాల స్థానంలో కొత్త నిర్మాణాలకు అనుమతి మంజూరైంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదనలతో ఖమ్మంలో మూడు బీసీ వెల్ఫేర్ హాస్టల్ భవనాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక్కో భవనానికి రూ.3 కోట్ల చొప్పున రూ.9 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో రఘునాథపాలెం మండలం వి.వెంకటాయ పాలెంలో బీసీ బాలుర హాస్టల్, ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ బాలుర హాస్టల్-1, జహీర్‌పురలోని బీసీ బాలుర హాస్టల్-2కు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించనున్నారు.

ఎడమ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుండి ఎడమ కాల్వకు గురువారం సాయంత్రం నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. రిజర్వాయర్ నీటిమట్టాన్ని పెంచేందుకు గాను రెండు రోజుల పాటు సరఫరా ఉండదని తెలిపారు. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 16 అడుగులు ఉండగా, సాగర్ నుండి 5,738 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఎడమ కాల్వకు 3,546 క్యూసెక్కులు, పాలేరు కాల్వకు 230 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ప్రాజెక్టుకు 135 క్యూసెక్కులు, భక్తరామదాసు ఎత్తిపోతల పథకానికి మరో 275 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎడమ కాల్వకు సరఫరా నిలిపివేయగా, రిజర్వాయర్ నీటిమట్టం 20 అడుగులకు చేరాక తిరిగి విడుదలచేస్తామని అధికారులు తెలిపారు.

మరో రోజు రండి..

జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం

- 748 షాపులకు గాను 90 షాపులకే సరఫరా
- ఇతర జిల్లాల్లో ప్రయత్నించినా నిల్వలు లేవని సమాధానం
- ఖరీఫ్‌లో సేకరించిన దొడ్డు బియ్యం పంపిణీపై దృష్టి



ఖమ్మంలోని ఓ రేషన్ షాప్‌లో బియ్యం ఇస్తున్న సిబ్బంది, మరో షాప్ వద్ద స్టాక్ లేదని ఏర్పాటుచేసిన బోర్డు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈనెల మొదటి వారం పూర్తికావొస్తున్నా జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా బియ్యం సరఫరా నత్తనడకన సాగుతోంది. ప్రతినెలా 1నుంచి 15వ తేదీ లోపు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేవారు. కానీ రెండు, మూడు నెలల నుంచి సరఫరాలో ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. ఈనెల కూడా షాప్‌లకు పూర్తిస్థాయిలో బియ్యం చేరకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలో బియ్యం నిల్వలు అడుగంటగా, ఇతర జిల్లాల నుంచీ అదే సమాధానం రావడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. దీంతో వానాకాలంలో కొనుగోలు చేసి మర ఆడించిన ధాన్యాన్ని రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తుండగా అన్ని షాపులకు చేరేవరకు ఇంకా సమయం పట్టనుంది.

748 షాపుల ద్వారా పంపిణీ

జిల్లాలో మొత్తం 4,11,566 రేషన్ కార్డులు ఉండగా, 748 షాప్‌ల ద్వారా 11,29,030 మంది లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీనెలా 6,343 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ అధికారులు ప్రతినెలా ఒకటో తేదీ కల్లా షాపులకు బియ్యం చేరవేస్తే డీలర్లు 1నుంచి 15వ తేదీవరకు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

ఇతర జిల్లాల్లోనూ లభ్యత లేక..

జిల్లాలో బియ్యం నిల్వలు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి సరఫరా చేస్తోంది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నుంచి ఇక్కడి గోదాంలకు 24నుంచి 30 తేదీలోపు చేరిస్తే.. ఆపై షాపులకు పంపించి లబ్ధిదారులకు ఇస్తున్నారు. కానీ ప్రస్తుతం సూర్యాపేట, నల్లగొండ తదితర జిల్లాల అధికారులు సైతం తమ వద్ద బియ్యం నిల్వలు లేవని సమాధానం ఇవ్వడంతో ఇక్కడ సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

వానాకాలం బియ్యమే..

ఇతర జిల్లాల్లోనూ బియ్యం లేనందున స్థానికంగానే ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది వానాకాలంలో రైతులు 90 శాతం సన్న ధాన్యం, 10 శాతం దొడ్డు ధాన్యం సాగు చేయగా.. పౌర సరఫరా సంస్థ ద్వారా సేకరించారు. ఇందులో దొడ్డు ధాన్యాన్ని మర ఆడించి రేషన్ దుకాణాలకు పంపిణీ చేయడం మొదలుపెట్టారు. అయితే, ఇప్పటివరకు జిల్లాలోని 748రేషన్ షాప్‌లకు గాను 90దుకాణాలకే చేరాయి. ఆయా దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేస్తుండగా, మిగతా షాపులకు వెళ్లిన లబ్ధిదారులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సన్నబియ్యం ఎప్పుడు ?

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ఉగాది నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించింది. అయితే ఈనెల కూడా దొడ్డు బియ్యమే ఇస్తుండగా, సన్న బియ్యం పంపిణీ చేసేదెప్పుడో స్పష్టత రావడం లేదు. ఉగాది పండుగ నుంచైనా రేషన్ దుకాణాలు, వసతి గృహాలకు సన్న బియ్యం పంపిణీ ఉంటుందా, లేదా అన్న సందిగ్ధత నెలకొంది.

ప్రతీనెలా సమస్యే

రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో ఇటీవల కొద్దినెలలుగా సమస్యలు ఎదురవుతున్నాయి. పోర్టబులిటీ విధానంలో ఎక్కడ కార్డు ఉన్నా.. ఇతర ప్రాంతాల్లోనూ బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండడంతో జిల్లా కేంద్రంతో పాటు మున్సిపాలిటీ కేంద్రాల్లో బియ్యం నిల్వలు త్వరగా అడుగంటుతున్నాయి. ఇలా పోర్టబులిటీ ద్వారా ఇచ్చిన బియ్యం వివరాలను డీలర్లు 7, 8వ తేదీకల్లా జిల్లా పౌరసరఫరాల అధికారులకు సమర్పిస్తే గోదాంల నుంచి అదనంగా కోటా విడుదల చేస్తారు. అయితే, డీలర్లకు కావాల్సిన బియ్యమే కాక అదనపు కోటా కూడా రాకపోవడంతో షాపుల వద్ద బియ్యం స్టాక్ లేవని, ఫలానా తేదీన రావొచ్చని బోర్డులు ఏర్పాటుచేస్తుండడంతో లబ్ధిదారులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. జిల్లాలోని గోదాంల్లో బియ్యం నిల్వలు నిండుకోవడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తుండగా.. గత నెల 25 వరకు, అంతకు ముందు నెల 30వ తేదీ వరకు బియ్యం సరఫరా కొనసాగించారు.

వారం రోజుల్లో సరఫరా చేస్తాం..



జిల్లాలోని అన్ని రేషన్ షాప్‌లకు వారంలోగా బియ్యం సరఫరా చేస్తాం. సూర్యాపేట, నల్లగొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ప్రయత్నించినా అక్కడ కూడా నిల్వలు లేవనే సమాధానం వచ్చింది. దీంతో జిల్లాలోనే వానాకాలం సేకరించిన ధాన్యాన్ని మర ఆడించి ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్నందున త్వరలోనే అన్ని షాపులకు బియ్యం చేరవేసి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చూస్తాం.

– శ్రీలత, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ

అన్ని ప్రాంతాలకూ మెరుగైన రహదారులు

రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

ముదిగొండ: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకూ మెరుగైన రవాణా సదుపాయం ఉండేలా రహదారులు విస్తరిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముదిగొండ నుంచి వల్లభి వరకు రెండు లేన్లు ఉన్న 5కి.మీ. రహదారిని రూ.28కోట్ల వ్యయంతో నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. ఈ పనులకు భట్టి గురువారం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చిన ఆయనకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ స్వాగతం పలికారు. అనంతరం ముదిగొండ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన భట్టి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశాక మాట్లాడారు. ఆతర్వాత ఖబరస్తాన్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముస్లింలు భట్టికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఆర్డీఓ నర్సింహారావు, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్‌చక్రవర్తితో పాటు కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, మందరపు నాగేశ్వరరావు, వల్లూరి భద్రారెడ్డి, పసుపులేటి దేవేంద్రం, తాటికొండ రమేష్, గుడిపూడి ఝాన్సీరాణి, పందిరి అంజయ్య పాల్గొన్నారు.

సీఎస్‌సీలతో విస్తృత సేవలు

ఖమ్మంసహకారనగర్: కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందుతున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ తెలిపారు. సెంటర్ల నిర్వాహకులకు కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడం, డిజిటల్ సేవలు మెరుగుపరచడానికి సెంటర్లు ఉపయోగపడతాయని చెప్పారు. దేశంలోని పది జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమం అమలు చేస్తుండగా ఖమ్మం జిల్లా కూడా ఉందని తెలిపారు. ఇప్పటికే 589 జీపీల్లో 434సెంటర్లు ఏర్పాటుచేయగా, మిగిలిన చోట్ల ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళా సంఘాలతో ఏర్పాటుకు ప్రణాళిక ఉందన్నారు. అనంతరం డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎస్‌పీవీ అండ్ హెడ్ జీ2సీ బాధ్యులు డాక్టర్ విఘ్నేష్ స్వర్ణమోహన్ మాట్లాడగా పలు సెంటర్ల నిర్వాహకులను సన్మానించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఎస్‌బీఐ ఆర్‌ఎం లింగస్వామి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, సునీల్‌రెడ్డి, సుహాసిని పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమాదేవి

ఖమ్మం లీగల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందు వరుసలో నిలవాలని అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి అన్నారు. ఖమ్మంలోని టీటీడీసీలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం న్యాయవాదులకు 'మహిళా సమస్యలు – చట్టాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉమాదేవి మాట్లాడుతూ ఇంటికి, సమాజానికి వెలుగునిస్తున్న మహిళలు ప్రస్తుతం పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఇదే ఒరవడి కొనసాగిస్తూ మరింత ముందుకు సాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో న్యాయమూర్తులు అపర్ణ, అర్చనకుమారి రాంప్రసాద్, మురళీమోహన్, ప్రభాకర్, చంద్రశేఖరరావు, కల్పన, శివరంజని దీప, రజిని, బిందుప్రియ, మాధవి, శాంతిలత, కార్తీక్‌తో పాటు విద్యుల్లత, ఐలూ బాధ్యులు కొల్లి సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, నాగేశ్వరరావు నవీన్, శ్రీలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇక కొత్త వేదికపై కల్యాణం

జమలాపురంలో సిద్ధమైన శ్రీ వకుళామాత స్టేడియం



ప్రారంభానికి సిద్ధమైన శ్రీవకుళామాత స్టేడియం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలో ఏటా బ్రహ్మోత్సవాల సమయాన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణంతో పాటు శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం ఇక నుంచి కొత్త వేదికపై జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన కేఎస్‌ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు-నిర్మల రూ.5కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ వకుళామాత స్టేడియంను శుక్రవారం ప్రారంభించనున్నారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో ఏటా జరిగే సీతారాముల కల్యాణం తరహాలో జమలాపురంలోనూ వేంకటేశ్వరస్వామి కల్యాణం, సీతారాముల కల్యాణం నిర్వహించాలనే ఆలోచనతో స్టేడియం నిర్మించారు. 2019లో హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి శంకుస్థాపన చేయగా ఇటీవలే పూర్తయింది. మూడు రోజులుగా అర్చకులు, వేద పండితుల సమక్షాన దాత కోటేశ్వరరావు దంపతులు యాగం నిర్వహిస్తున్నారు. కాగా, శుక్రవారం జరిగే స్టేడియం ప్రారంభోత్సవంలో వేలాది భక్తులు పాల్గొననున్న నేపథ్యాన ఏర్పాట్లు చేశారు.



ఎస్టీపీ పనితీరును మేయర్, కార్పొరేటర్లు, అధికారులకు వివరిస్తున్న నిర్వాహకులు

పుణే.. నమూనా

- అక్కడ ఎస్టీపీలతో సమర్థంగా మురుగునీటి నిర్వహణ
- యూజీడీలతో మెరుగుపడిన పారిశుద్ధ్యం
- అధ్యయనం చేస్తున్న కేఎంసీ బృందం

ఖమ్మంమయూరిసెంటర్: నగరాలు, పట్టణాల అభివృద్ధితో పాటే పారిశుద్ధ్య సమస్య సైతం పెరుగుతుంటుంది. విస్తరిస్తున్న కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వీధుల్లోని ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లోకి మురుగు చేరుతుండడం.. డ్రెయినేజీలు ఉన్న చోట మురుగు వెళ్లి నదులు, చెరువుల్లోకి చేరి కలుషితం కావడం సాధారణంగా మారింది. ఈనేపథ్యాన ఎస్టీపీ(మురుగు నీరు శుద్ధీకరణ ప్లాంట్)లు ఏర్పాటుచేస్తే జల వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చు. ఈక్రమాన దేశంలోనే పారిశుద్ధ్య నిర్వహణలో మేటిగా నిలుస్తున్న పుణే మహానగరంలో మురుగు నీటి శుద్ధీకరణకు పెద్దసంఖ్యలో ఎస్టీపీలు ఏర్పాటుచేశారు. అక్కడ రోజుకు 500 ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధి చేసే 10 ప్లాంట్లు నిర్వహణలో ఉండగా, మరో 11 సిద్ధమవుతున్నాయి. వీటి ద్వారా పుణే మధ్యలో ప్రవహించే మూలముత్త నదిలో కలిసే మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. ఈమేరకు పుణేలో మురుగునీటి నిర్వహణ, ఇతర అంశాలపై అధ్యయనానికి వెళ్లిన ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు వీటిని పరిశీలిస్తున్నారు.

యూజీడీలు, ఎస్టీపీల మీదుగా నదిలోకి..

కేఎంసీ కార్పొరేటర్లు, అధికారుల బృందం గురువారం పుణేలోని మూలముత్త నదిని పరిశీలించారు. మూల, ముత్త నదుల సంగమంగా ఏర్పడిన ఈ నది నగరం మీదుగా ప్రవహిస్తోంది. అయితే, డ్రెయినేజీల ద్వారా మురుగునీరు ఇందులోకి చేరుతుండడంతో ప్రజలు, పర్యావరణ వేత్తల ఆందోళనతో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యాన ఎస్టీపీలను ఏర్పాటు చేశారు. తద్వారా మురుగునీరు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ)ల్లోకి చేరి ఆపై ఎస్టీపీల ద్వారా శుద్ధి అయ్యాక నదిలో కలుస్తోంది. ఇలాంటి విధానాన్నే ఖమ్మంలోనూ అమలుచేయాలనే భావనకు కేఎంసీ పాలకవర్గం, అధికారులు వచ్చారు. ప్రస్తుతం ఖమ్మం శ్రీనివాసనగర్ వద్ద నిర్మాణంలో ఉన్న ఎస్టీపీని పూర్తి చేస్తే కొంత మేర మురుగు నీరు మున్నేరులో కలవకుండా అడ్డుకట్ట పడుతుందని.. ఆపై కొత్తగా మంజూరైన మరో నాలుగు ప్లాంట్లను ప్రధాన చెరువుల వద్ద ఏర్పాటు చేస్తే నగరంలోని మురుగునీటి శుద్ధి జరుగుతుందనే భావనకు వచ్చారు. అంతేకాక ఖమ్మం నగరమంతా యూజీడీ నిర్మిస్తేనే మురుగునీరు శుద్ధికి వీలవుతుందనే చర్చ కూడా జరిగింది.

కీలకంగా మూలముత్త నది

కేఎంసీ బృందం పర్యటనలో మూలముత్త నది కీలకంగా నిలిచింది. ఈ నది పుణే నగరంలో 44 కి.మీ. మేర ప్రవహిస్తోంది. నదికి ఇరువైపులా కరకట్టల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,700 కోట్లు కేటాయించింది. దీనికి తోడు అక్కడి నగర పాలక సంస్థ ఆధ్వర్యాన ఇరువైపులా 5 కి.మీ. అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కరకట్ట వెంట మొక్కలు నాటడం, కట్టపై వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రతీ 300 మీటర్లకు ఒక ఘాట్ నిర్మాణం జరుగుతుండగా.. ఖమ్మంలో మున్నేరునూ ఇదే తరహాలో అభివృద్ధి చేస్తే నగరం మరింత ఆకర్షణీయంగా మారుతుందనే ఆలోచనకు కేఎంసీ బృందం వచ్చింది.

అతిపెద్ద ఎస్టీపీ

పుణే నగరంలో 500 ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధి చేసేందుకు 10 ఎస్టీపీలు నిర్మించారు. ఇందులో అతిపెద్దదైన డాక్టర్ నాయుడు మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను రూ.40 కోట్ల వ్యయంతో పది ఎకరాల్లో నిర్మించారు. ఈ ప్లాంట్ రోజుకు 115 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేస్తుండడం విశేషం.

తొలి రోజంతా పరిశీలన, సమావేశాలు

కేఎంసీ బృందం తమ పర్యటనలో తొలిరోజైన గురువారం పుణేలోని మూలముత్త నదితో పాటు ఎస్టీపీలను పరిశీలించారు. అనంతరం అక్కడి మహానగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించగా కౌన్సిల్ హాల్ అసెంబ్లీ హాల్‌ను తలపించేలా ఉండడంతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పుణే మహానగర పాలకసంస్థ అడిషనల్ కమిషనర్ పృథ్వీరాజ్, అధికారులతో ఖమ్మం మేయర్ నీరజ, కార్పొరేటర్లు, అధికారులు సమావేశం కాగా, అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రెవెన్యూ, పరిపాలన తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈక్రమంలో మేయర్ నీరజ, అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా అహ్మద్, కార్పొరేటర్లు పలుఅంశాలు తెలుసుకున్నారు. ఈఈ కృష్ణాలాల్, ఏఓ శివలింగం, టీపీఎస్ సంతోష్, ఏఈలు తేజ్, యాకూబ్ వలీ పాల్గొన్నారు.



కేఎంసీ బృందంతో సమావేశమైన పీఎంసీ అధికారులు

సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కృష్ణమ్మ ఒడిలోకి గోదావరి

- ఎన్నెస్పీ కెనాల్‌లో కలిసిన గోదావరి జలాలు
- లింక్ కెనాల్‌కు భూములు ఇచ్చిన రైతుల ఖాతాల్లో పరిహారం
- అటు జలం, ఇటు పరిహారంతో రైతుల్లో ఆనందం



లింక్ కెనాల్ ద్వారా సాగర్ కాల్వలో కలుస్తున్న గోదావరి జలాలు

ఏన్కూరు: ఏన్నో ఏళ్లుగా రైతులు, సామాన్య ప్రజానీకం ఎదురుచూస్తున్న తరుణం వచ్చేసింది. మూడు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను విడుదల చేయగా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మీదుగా జూలూరుపాడు మండలం వినోభానగర్ సమీపానికి బుధవారం రాత్రి 9.30 గంటలకు చేరుకున్నాయి. ఆ తర్వాత రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏన్కూర్ లింక్ కెనాల్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయగా, 8.6 కి.మీ. పొడవైన కెనాల్‌లో ప్రవహించిన గోదావరి నీరు గురువారం తెల్లవారుజాము కల్లా ఏన్కూరులోని ఎన్నెస్పీ కెనాల్ 52 కి.మీ. రెగ్యులేటర్ వద్దకు చేరడంతో కృష్ణా – గోదావరి సంగమం ఆవిష్కృతమైంది.

సాగుకు సమస్య లేనట్లే...

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కోసం జిల్లాలో కెనాళ్లు నిర్మించగా లక్షల ఎకరాల్లో ఆయకట్టు సాగవుతోంది. అయితే, కృష్ణా పరీవాహకంలో వర్షాలు కురవని సమయంలో సాగర్‌లో నీటి లభ్యత లేక సాగుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యాన సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసే నీటిని ఎన్నెస్పీ కాల్వల్లోకి మళ్లించాలనే ఆలోచనతో జూలూరుపాడు మండలం వినోభానగర్ వరకు పూర్తయిన ప్రధాన కాల్వ నుంచి ఏన్కూరులోని ఎన్నెస్పీ కెనాల్ వరకు 8.6 కి.మీ. లింక్ కెనాల్‌ను రూ.96కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ కాల్వ నిర్మాణం పూర్తికావడంతో గోదావరి జలాలను విడుదల చేయగా ఎన్నెస్పీ కెనాల్‌లోకి చేరాయి. ఆపై ఎస్కేప్ లాక్‌ల ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లిస్తున్నారు. దీంతో సాగర్ ఆయకట్టు, సాగర్ జలాలపై ఆధారపడిన వైరా రిజర్వాయర్ కింద ఆయకట్టుతో పాటు సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సైతం పంటల సాగుకు ఢోకా ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది.



చాన్నాళ్లుగా పరిహారం కోసం ఎదురుచూశాం. తొలుత ఎకరానికి రూ.14లక్షలే ఇస్తామన్నారు. మా పోరాట ఫలితంగా రూ.21లక్షల చొప్పున జమ చేశారు. కాల్వ నిర్మాణానికి మా భూమి 28 గుంటలు కోల్పోయాం. ఈ భూమికి పరిహారం అందడమే కాక నీరు విడుదల చేయడం సంతోషంగా ఉంది. – భూక్యా కిషన్, రైతు హిమాం నగర్

194 మందికి పరిహారం

సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ నిర్మాణానికి రైతుల నుంచి 139.6 ఎకరాల భూమి సేకరించారు. ఈమేరకు 205 మంది రైతులకు ఎకరాకు రూ.14లక్షల పరిహారం చెల్లిస్తామని తొలుత ప్రకటించారు. ఇందుకు రైతులు ససేమిరా అన్నప్పటికీ పనులు పూర్తిచేశారు. అయితే, కాల్వ పనులను పరిశీలనకు పలుమార్లు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభానికి ముందే పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి నీటి విడుదలకు కొద్ది గంటల ముందు ఎకరాకు రూ.21లక్షల పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతం 194 మంది రైతుల ఖాతాల్లో పరిహారం జమ కాగా, మిగతా వారికి ఒకటి, రెండు రోజుల్లో అందుతాయని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం జుజ్జుల్‌రావుపేటలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయం ప్రాణ ప్రతిష్ఠా ఉత్సవాల్లో మంత్రి పాల్గొంటారు. ఆతర్వాత క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తారు. అనంతరం కూసుమంచి మండలం తురకగూడెం, కేశవాపురం, గోపాల్‌రావుపేట, ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల, ఏదులాపురం మున్సిపాలిటీ బారుగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఆడపిల్లలపై వివక్షత చూపించొద్దు..



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కోఆర్డినేటర్

సత్తుపల్లి: గర్భిణులకు లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమే కాక ఆడపిల్లల వివక్షత చూపించడం సరికాదని జిల్లా మహిళా సాధికారిత కోఆర్డినేటర్ ఎస్.డీ.సమ్రీన్ తెలిపారు. సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని సిమాంక్ సెంటర్‌లో గురువారం బేటీ బచావో.. బేటీ బడావో.. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆడపిల్లలకు జన్మనిచ్చిన బాలింతలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం లింగనిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించిన ఆమె ప్రతిజ్ఞ చేయించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ పి.ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఉద్యోగులు కె.సతీష్, ఎస్.శారద, వెంకటరావమ్మ, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

ఈనెల 12న పాత పార్సిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో సెంటర్ నుంచి నిర్ణీత కాలవ్యవధి దాటినా ఎవరూ తీసుకెళ్లని పార్సిళ్లను ఈనెల 12న వేలం వేయనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ వి.రామారావు తెలిపారు. కొత్త బస్టాండ్ ఆవరణలో ఈనెల 12న ఉదయం 11గంటలకు వేలం మొదలవుతుందని పేర్కొన్నారు. ముందస్తు డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేనందున, ఎవరైనా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించండి



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించే అదృష్టం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈ జేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు సూచించారు. డీఎస్సీ–2024లో ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి ఖమ్మం నయాబజార్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తుండగా గురువారం ఆయన మాట్లాడారు. ఉద్యోగు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని రద్దు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ఎస్టీఎఫ్ కృషి చేస్తోందని తెలిపారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, షేక్ మన్సూర్‌తో పాటు బిల్లా సురేష్, పాశం శ్రీనివాసరావు, జల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

కల్లూరురూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా క్షయ వ్యాధి నోడల్ అధికారి డాక్టర్ జి.రామారావు తెలిపారు. కల్లూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవ్యకాంత్ ఆధ్వర్యాన కల్లూరు మండలం పేరువంచలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురికి పరీక్షలు చేశాక ఆయన మాట్లాడారు. క్షయవ్యాధి గాలిద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలని కోరారు. ఉద్యోగులు వై.సురేష్, సంజీవ్‌కుమార్, పద్మ, కామేశ్వరి, కవెంకట నరసమ్మ, ప్రభావతి, మీనా, సునీత పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	5,500
కందులు	7,151	6,950
మిర్చి	14,050	11,000
మిర్చి తాలు	6,500	5,100
పత్తి	6,800	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

దివ్యాంగులకు 'శాశ్వత' పరిష్కారం

- ఇక నుంచి యూడీఐడీ స్మార్ట్ కార్డులు జారీ
- అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
- కార్డుతో దివ్యాంగులకు మరింత ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో 55,718 మంది దివ్యాంగులు



సదరం శిబిరాలకు హాజరైన దివ్యాంగులు (ఫైల్)



యూడీఐడీ స్మార్ట్ కార్డ్

ఉమ్మడి జిల్లా వివరాలు ఇలా..

	భద్రాద్రి	ఖమ్మం
సదరం శిబిరాలకు హాజరైనది	31,906	62,390
టెంపరరీ వైకల్యం కలిగినవారు	3,882	7,853
శాశ్వత వైకల్యం కలిగినవారు	19,280	36,438
అనర్హులుగా తేల్చినది	8,744	18,099

చుంచుపల్లి: దివ్యాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్లకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. వాటి స్థానంలో ఇక నుంచి యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చి దివ్యాంగులు నేరుగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఇవి పలు రాష్ట్రాల్లో అందుబాటులో ఉండగా, ఈ నెల నుంచి మన రాష్ట్రంలో కూడా పూర్తిస్థాయిలో అమల్లోకి తెస్తున్నారు. గతంలో ఈ స్మార్ట్ కార్డులను పలు చోట్ల దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఇటీవల సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులందరికీ ఈ యూడీఐడీ నంబర్‌ను కేటాయించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్డుల కోసం ప్రభుత్వం ఇచ్చిన సంబంధిత వెబ్‌సైట్‌లో దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు కేవలం ఏడు కేటగిరీల్లో మాత్రమే సదరం సర్టిఫికెట్లు ఇస్తుండగా, ఈ యూడీఐడీ కార్డుల అమలుతో ఇక నుంచి 21 కేటగిరీలకు అవకాశం కల్పించారు. దివ్యాంగులకు బస్సు, రైళ్ల ప్రయాణాల్లో అందించే రాయితీలు అలాగే విద్య, వైద్యం, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తదితర వాటిని ఈ గుర్తింపు కార్డు ద్వారా పరిగణనలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఆసరా పింఛన్ ద్వారా దివ్యాంగులకు రూ.4,016ను ప్రతినెలా అందిస్తున్నారు. అలాగే వారు ఎవరిపై ఆధారపడకుండా ఆర్థికంగా ఎదగడానికి స్వయం ఉపాధి కోసం వివిధ రకాల రాయితీ రుణాలు సైతం అందిస్తున్నారు. మరోవైపు దివ్యాంగులకు సంక్షేమ శాఖ ద్వారా పలు రకాల ఉపకరణాలను అందిస్తున్నారు.

యూడీఐడీ కార్డు ఇలా పొందాలి..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 55,718 మంది శాశ్వత వైకల్యం కలిగినవారు ఉన్నారు. అంగవైకల్య శాతం ధ్రువీకరణ కోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇస్తున్న సదరం ధ్రువపత్రాలు ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పనిచేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో వీటిని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో వీటికి బదులు యూడీఐడీ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది.

http://www.swavlambancard.gov.in పోర్టల్‌లోకి వెళ్లి యూడీఐడీ కార్డు కోసం సమగ్ర వివరాలు పొందుపర్చాలి.

- పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం, ఆధార్ కార్డు తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలి.
- మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి హాజరుకావాల్సి ఉంటుంది.
- సదరం శిబిరానికి హాజరయ్యేలా అందుబాటులోని కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి.
- తద్వారా ఏరోజు శిబిరం నిర్వహిస్తారో దరఖాస్తుదారుడి ఫోన్‌కు సందేశం వస్తుంది.
- ఆ రోజున వెళ్తే అక్కడి వైద్యులు పరీక్షించి వైకల్యం శాతాన్ని నిర్ధారించి పోర్టల్‌లో నమోదు చేస్తారు.
- ఇప్పటికే సదరం ధ్రువపత్రాలు కలిగిన వారికి కూడా స్మార్ట్ కార్డులను ఇదే తరహాలో జారీ చేస్తారు.
- వివరాలను సరిచూసి వైద్యులు నిర్ధారించిన అనంతరం స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకాలతో కూడిన స్మార్ట్ కార్డులో ఐడీ నంబర్, దివ్యాంగుడి పేరు, వైకల్య రకం, శాతం తదితర వివరాలు ఉంటాయి. వీటిని నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు పంపుతారు.
- స్మార్ట్ కార్డులతో రైలు, బస్సు టికెట్లపై రాయితీలు పొందవచ్చు. పింఛన్లు, సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలు అందుకునే వెసులుబాటు ఉంది.
- దేశంలో ఎక్కడైనా ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది.
- కార్డును శాశ్వతంగా వినియోగించుకునే వీలుంటుంది.

మరింత ప్రయోజనం



ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల స్థానంలో యూడీఐడీ కార్డులను అమల్లోకి తెచ్చింది. వీటిపై దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో అర్హులందరికీ స్మార్ట్ కార్డు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇది అన్ని ప్రాంతాల్లో చెల్లుబాటవుతుంది. దివ్యాంగులకు దీనివల్ల మరింత ప్రయోజనం కలుగుతుంది.

– విద్యాచందన, డీఆర్‌డీఓ, భద్రాద్రి కొత్తగూడెం

ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే ఈ ఫలితాలు

సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు



స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకతతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించిన సందర్భంగా గురువారం ఖమ్మంలో బీజేపీ నాయకుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ నివాసం వద్ద సంబురాలు నిర్వహించారు. బాణసంచా పేల్చడంతో పాటు స్వీట్లు పంపిణీ చేశాక హరీశ్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యువతకు ఉద్యోగాలు లేక, రైతుకు గిట్టుబాటు ధరలు దక్కకపోగా ఆరు హామీలను సంపూర్ణంగా నెరవేర్చలేదని ఆరోపించారు. అలాగే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి వెళ్తే కాంగ్రెస్ మరిన్ని అప్పులు చేస్తోందని పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ గమనించిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు బీజేపీ అభ్యర్థులను గెలిపించారని తెలిపారు. అనంతరం బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ మాట్లాడగా నాయకులు దేవకి వాసుదేవరావు, డాక్టర్ శీలం పాపారావు, డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, నకిరికంటి వీరభద్రం, మంద సరస్వతి, నున్నా రవికుమార్, పొట్లపల్లి నాగేశ్వరరావు, కొంఇతం లక్ష్మీనారాయణ, శాసనాల సాయికుమార్, బాషా, సాయి, ప్రభాకర్, మహేందర్ సింగ్, మేకల నాగేందర్, సాగర్, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ముల్క కొమురయ్య, అంజిరెడ్డి విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పంటల వైవిధ్యీకరణపై ఏఈఓలకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త ప్రగతికుమారి

వైరా: పంటల సాగులో అనుసరించాల్సిన వినూత్న విధానాలపై వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లాలోని ఏఈఓలకు శిక్షణ ఇచ్చారు. అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యాన సమగ్ర వ్యవసాయ పద్ధతుల విభాగం, మధిర వ్యవసాయ పరిశోధనా సంస్థ, వైరా కేవీకే నేతృత్వంలో శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.గోవర్ధన్, డాక్టర్ సీహెచ్.ప్రగతికుమారి మాట్లాడుతూ గత ఏడాది చింతకాని మండలంలో పలువురు రైతులు యాసంగిలో జీరో టిల్లేజ్ విధానంలో వరికి బదులు మొక్కజొన్న, పెసర, మినుము సాగు చేసి అధిక దిగుబడులు సాధించారని తెలిపారు. వరి తర్వాత దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేసే విధానంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం మరో శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి యాసంగిలో వరికి బదులు పప్పుధాన్యాల సాగుతో కలిగే లాభాలను వివరించారు. వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ జె.రవీందర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ ఫణిశ్రీ, డాక్టర్ టి.భరత్, డాక్టర్ నాగస్వాతి, డాక్టర్ జి.వినయ్, సాయిబాబా పాల్గొన్నారు.

100శాతం పన్నుల వసూళ్లపై దృష్టి



మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

బోనకల్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ఈనెల 20 నాటికి 100 శాతం ఇంటి పన్నులు పూర్తిచేయడమే కాక షాపుల యజమానులతో ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. బోనకల్ మండల పరిషత్ కార్యాలయంలో చింతకాని, బోనకల్ మండలాల కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండ తీవ్రత నేపథ్యాన అన్ని జీపీల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయడంతో పాటు నీటి కొరత ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని తెలిపారు. ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున బరిలోకి దిగిన పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడం హర్షణీయమని సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ బాధ్యుల అలుపెరగని కృషితో ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. త్వరలోనే ఖమ్మంలో శ్రీపాల్‌రెడ్డి అభినందన సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు మోత్కూరి మధుతో పాటు వెంకటనర్సయ్య, కొండలరావు, లక్ష్మణరావు, శ్రీనివాస్, రవీంద్ర, గుడిపుడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరుపుల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- రూ.30 లక్షల మేర ఆస్తినష్టం



ఫ్యాక్టరీలో ఎగిసిపడుతున్న మంటలు



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

తల్లాడ: తల్లాడలోని ఓ పరుపుల ఫ్యాక్టరీలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. మల్లారం రోడ్డులో ఉన్న ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న ప్రమాదం కారణంగా సుమారు రూ.30 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తల్లాడలో ఐదేళ్ల క్రితం పస్తం రంగారావు, ఆయన కుమారుడు పస్తం మద్దిరామయ్య పేరిట పరుపుల ఫ్యాక్టరీ ఏర్పాటుచేశాడు. ఇక్కడ తయారుచేసే పరుపులను ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. కాగా, ఫ్యాక్టరీలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు తెలుస్తుండగా మొదలైన మంటలు క్షణాల్లోనే వ్యాపించాయి. పరుపులు, పరుపుల తయారీకి కావాల్సిన సామగ్రికి మంటలు అంటుకునే స్వభావం ఉండడంతో మంటలు ఎగిసిపడగా తయారుచేసిన పరుపులు, ముడి సరుకు, మిషనరీ, వ్యాన్ కాలిపోయాయి. కాగా, మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు బెంబెలెత్తిపోయారు. వైరా అగ్ని మాపక కేంద్రం నుంచి వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే రూ.30లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని యజమాని మద్దిరామయ్య తెలిపారు. కాగా, తల్లాడ పోలీసులు చేరుకుని ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

క్షుద్రపూజలు చేశారని ప్రచారం

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా అతి పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం క్షుద్రపూజలు చేశారనే ప్రచారం జరిగింది. క్షేత్రం సమీపాన ఎర్రటి రంగుతో కూడిన కొబ్బరికాయ ఉండడంతో ఎవరైనా ఆకతాయిలు ఈ పనిచేశారా లేక... దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలకు సిద్ధమయ్యారా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై పురావస్తు శాఖ డీడీ రాములునాయక్ ను వివరణ కోరగా... క్షుద్రపూజలు జరిగే అవకాశమే లేదని, ఎవరైనా అలా చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్రం వద్ద వాచ్‌మెన్‌ను మరింత అప్రమతంగా ఉండాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కాటమయ్య కిట్‌తో తప్పిన ప్రాణాపాయం



కాళ్లకు పట్టు తప్పడంతో చెట్టు మధ్యలో ఆగిపోయిన గీత కార్మికుడు



కిందకు దిగుతున్న పెద్ద గోవిందు

బోనకల్: ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఇటీవల గీతకార్మికులకు అందజేసిన కాటమయ్య కిట్‌తో ఓ గీత కార్మికుడి ప్రాణాలు దక్కాయి. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలకు చెందిన పెద్ద గోవిందు రోజుమాదిరిగానే గురువారం కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. కల్లు తీసుకుని ఆయన కిందకు దిగుతుండగా కాలు జారి పట్టు విడిపోగా, కాటమయ్య సేఫ్టీ కిట్ ధరించి ఉండడంతో అలాగే చెట్టుపై వేలాడసాగాడు. ఈ విషయాన్ని గమనించిన సమీప ప్రాంత రైతులు చేరుకుని ట్రాక్టర్ ట్రాలీపై పైకి లేపి అందులో నిచ్చెన వేసి ఆయన వద్దకు వెళ్లి తాడు అందించారు. ఆతర్వాత అందరూ కలిసి పెద్ద గోవిందును సురక్షితంగా కిందకు దించడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది.

విద్యుత్ అధికారుల పొలం బాట



పొలం బాటలో పాల్గొన్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి, ఉద్యోగులు

మధిర: రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యాన పొలం బాట నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇల్లూరు, దెశినేనిపాలెంలోగురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి పాల్గొని మాట్లాడారు. రైతులు పొలాల్లోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, తద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. అలాగే, సమస్య ఎదురైతే సొంతంగా మరమ్మతు చేయకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించాన తొలిసారి మధిరకు వచ్చిన శ్రీనివాసాచారికి ఏడీఈ ఎం.అనురాధ ఆధ్వర్యాన స్వాగతం పలకగా, వైరా ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈలు ఎస్.అనిల్‌కుమార్, మైథిలి, ఉద్యోగులు రాజేశ్వరి, వినయ్, రఘు, చెరుపల్లి శ్రీధర్, మాధవరెడ్డి, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రైతులు దుగ్గినేని వెంకటరామయ్య, దామా శేషగిరి తదితరులు ఎస్‌ఈ సన్మానించారు.

'ఆపదమిత్ర' వలంటీర్లకు శిక్షణ

ఖమ్మంఅర్బన్: వరదలు, అగ్నిప్రమాదాలు తదితర విపత్తుల సమయాన సాయం చేసేందుకు గాను ఎంపిక చేసిన ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన శిక్షణలో డీఆర్‌డీఓ సన్యాసయ్య మాట్లాడుతూ విపత్తుల సమయాన ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు అండగా నిలిచేలా 'ఆపదమిత్ర'ల పేరిట వలంటీర్లను ఎంపిక చేశామని తెలిపారు. వీరికి అటవీ, పోలీస్, ఫిషరీష్ తదితర శాఖల ఆధ్వర్యాన శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. పశుసంవర్ధశాఖ జేడీ వెంకటనారాయణ, జిల్లా ప్రణాళికాధికారి శ్రీనివాస్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని రజబ్‌అలీ నగర్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని(17) ఆత్మహత్యకు పాల్పడింది. ఈనెల 5వ తేదీ బుధవారం ఆమెను పక్క ఇంట్లో ఉండే రామి అనే మహిళ తీసుకెళ్లి తన కొడుకు పెళ్లి చేసుకోబోయే అమ్మాయిగా స్థానికులు పలువురికి చెప్పింది. దీంతో బాలిక మనస్తాపంతో బుధవారం రాత్రి కలుపు మందు తాగగా, కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందింది. ఆమె తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. కాగా, సదరు విద్యార్థిని గురువారం మొదలైన వార్షిక పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతుండగా ఈ ఘటన జరగడం గమనార్హం.

ఉరి వేసుకుని...

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన సీ.హెచ్.వీరబాబు (35) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనారోగ్య కారణాలతో ఆయన ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బూరెడుగుట్ట తండాకు చెందిన మూడ్ లక్ష్మణ్(35) తన ద్విచక్ర వాహనంపై కూసుమంచి నుండి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమాన గట్టుసింగారం నుండి కూసుమంచి వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలు కావడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడగా 108లో ఖమ్మం తరలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నం

సత్తుపల్లిరూరల్: భార్యాభర్తల మధ్య గొడవతో మనస్థాపానికి గురైన వ్యక్తి బ్లేడ్‌తో చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని కిష్టారానికి చెందిన పాలకుర్తి నాగరాజుకు గ్రామానికే చెందిన సౌమ్యను పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, దంపతుల మధ్య గొడవతో సౌమ్య ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన నాగరాజుకు ఆర్థిక ఇబ్బందులు తోడవడం, భార్య రావడం లేదనే మనస్థాపానికి గురై మద్యం మత్తులో గురువారం మధ్యాహ్నం రెండు చేతులపై బ్లేడ్‌తో కోసుకున్నాడు. దీంతో రక్తస్రావం అవుతుండగా 108లో సత్తుపల్లికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

పశుసంవర్ధక శాఖ జేడీపై కేసు నమోదు

ఖమ్మంక్రైం: అపార్ట్‌మెంట్ నిర్మించి ఇస్తామని నమ్మించి మోసం చేసిన పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. డీడీ రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ కొనసాగుతున్నట్లు తెలుస్తుండగా, ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల ప్రాంతంలో సర్వే నంబర్ 546లోని నాలుగు ఎకరాల భూమిలో హ్యాపీ హోం అపార్టుమెంట్ 24 నెలల్లో నిర్మించి ఇస్తామని 2021లో ఆయన పలువురితో అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఈమేరకు వారి నుంచి ప్లాట్లకు డబ్బు కూడా తీసుకున్నాడు. అయితే, గడువులోగా నిర్మాణం పూర్తికాకపోవడంతో ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురానికి చెందిన మారుపాక వెంకటాచారి ఇచ్చిన ఫిర్యాదుతో డీడీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.35 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన కిరాణ వ్యాపారి మేడబోయిన వేణు రూ.35.20లక్షలకు దివాళా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. వ్యాపార అభివృద్ధి చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ 22 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఐపీ దాఖలు చేశాడు.